క్లుప్తంగా

నత్తనడకన కోనసీమ రైల్వే ప్రాజెక్ట్

అమలాపురం టౌన్: గత 25 ఏళ్లుగా కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ పనులు నత్తనడకన నడుస్తున్నాయని, ఈ పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన రైలు కూత వినపించాలని కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్ఆర్ఎస్) ప్రతినిధుల బృందం అమలాపురంలో ఎంపీ, ఎమ్మెల్యేలకు సోమవారం వేర్వేరుగా వినతి పత్రాలు అందించింది. ఇదే సమయంలో అమలాపురంలో గత రెండేళ్లుగా మూతపడిన రైల్వే టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను కూడా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కేఆర్ఎస్ఎస్ కన్వీనర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, కేఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, కల్వకొలను తాతాజీ, ఉప్పుగంటి భాస్కరరావు, బీఎస్ మూర్తి తదితరులతో కూడిన బృందం ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే ఆనందరావును తమ క్యాంపు కార్యాలయాల్లో కలసి రైల్వే లైన్ నిర్మాణం గురించి చర్చించారు. కేఆర్ఎస్ఎస్ సభ్యులు పోలిశెట్టి శివాజీ, యర్రమిల్లి పాండురంగారావు, ఎరగర్ల వెంకటేశ్వరరావు తదితరులు ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వారిలో ఉన్నారు.

ఎస్‌జీఎఫ్‌కు విద్యార్థుల ఎంపిక

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 11న కాకినాడలో జరిగిన సపక్ తక్రా క్రీడ జిల్లా జట్టుకు స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.రోహిత్, ఎ.యశ్వంత్ ఎంపికయ్యారు. జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్న విజేతల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి వెల్లడించారు. విజేతలను స్థానిక వార్డు కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్, కోచ్ కట్టా సతీష్‌తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే ఎనిమిదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎర్రమిల్లి జయరామ్ ఆధ్వర్యంలో రాజ్ కమల్ ఫౌండేషన్ (యుఎస్ఏ) ద్వారా రూ.1.70 లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను జిల్లాలోని 35 పాఠశాలల్లోని విద్యార్థులకు సమకూర్చిందని ఆ ఫౌండేషన్ సలహాదారు, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఈ పరీక్ష కోసం ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిలో 400 మందికి ఈ ఉచిత స్టడీ మెటీరియల్‌ను ఇచ్చారు. ఇందులో భాగంగా అమలాపురంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మెటీరియల్‌ను డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తదితరులు సోమవారం సాయంత్రం పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసిన ఫౌండేషన్‌కు డీవైఈవో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గణితావధాని సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఐ.పోలవరం: ముమ్మిడివరం నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ కారణాలతో మృతిచెంది, క్షతగాత్రులుగా మారిన 159 బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అందజేశారు. ఈ మేరకు మురమళ్ల కార్యాలయంలో రూ.87 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 430 లబ్ధిదారులకు రూ.3.25 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించినట్టు వివరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన వృద్ధుడికి అస్వస్థత

అమలాపురం రూరల్: అమలాపురంలో పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఓ వృద్ధుడు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన వైద్యసిబ్బంది, అధికారులు ఆవృద్ధుడిని అంబులెన్స్‌లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాట్రేనికోన మండలం రావూరిపేటకు చెందిన జగడం భీముడుగా గుర్తించారు. కొంతకాలంగా ఆయన పెన్షన్ కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నట్లు అతని కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కలెక్టరేట్‌లో వైద్య శిబిరంలో ఉన్న వైద్య సిబ్బంది సపరి చార్యలు చేసి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

స్తంభాలు పాతిన వారిపై చర్యలు

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 123లోని తమ స్థలానికి అడ్డంగా స్తంభాలు పాతిన వారిపై చర్యలు చేపట్టాలని సర్పంచ్ నాగేశ్వరరావు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 9న తమ స్థలంలో పనులు చేస్తుండగా గ్రామానికి చెందిన గుత్తుల నాగేశ్వరరావు, శ్రీను, పితాని అర్జునరావు, పోతురాజు, పి.శ్రీనివాసరావు తదితరులు ఆటంకాలు కలిగించారన్నారు. దీనిపై ఫిర్యాదు చేయగా, 123, 125 సర్వే నంబర్లలో అధికారులు ఈ నెల 12న సర్వే చేశారని తెలిపారు. అదేరోజు రాత్రి తమ స్థలం ముందు పై వ్యక్తులు అనుచరులతో స్తంభాలు పాతరన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ ధిక్కరించి ఈ చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. స్తంభాలను తక్షణమే తొలగించాలని సర్పంచ్ కోరారు.

నష్టపోతున్నాం.. పట్టించుకోరొయ్యా

- వాతావరణ మార్పులతో హడలు
- రోజురోజుకు విజృంభిస్తున్న వైరస్‌లు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆక్వా రైతులు


సామంతకుర్రులో పట్టుబడి పట్టిన వనామీ రొయ్యలు


కాట్రేనికోనలోని చెరువులో ఏరియేటర్లు

ఉప్పలగుప్తం: దేశానికి రైతే రాజు అని అంటుంటారు. ఒకప్పుడు రొయ్య సాగు చేసే రైతు రాజులాగే జీవించేవాడు. కొంత కాలంగా రొయ్య సాగు చేస్తున్న రైతులు సాగులో లాభాలు లేక నష్టాలను చూస్తూ డీలా పడుతున్నారు. రొయ్య సాగు చేసే ఆక్వా రైతుకు జూన్ నుంచి డిసెంబరు వరకు చేసే సాగు కత్తి మీద సాము లాంటిదే అని చెప్పవచ్చు. ఈ పరిస్థితిల్లోనే కొంతమంది రైతులు సాగుకు విరామం ప్రకటించి సంవత్సరానికి రెండు సాగులు చేపట్టే దిశగా ఆలోచిస్తున్నారు. మరికొందరు రైతులు వాతావరణం రీత్యా ప్రమాదమని తెలసినప్పటికీ సాగు చేసి ఆదాయం తీయకపోతామా అనే గంపెడు ఆశలతో ప్రకతిపై నమ్మకాన్ని పెట్టుకొని సాగు చేస్తున్నారు.

చిన్న సైజులో ఉండగానే మృత్యువాత

ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులకు ఆక్వా రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత పది రోజుల క్రితం వరకూ భానుడు భగభగలాడుతూ ఎండలు కాసినప్పటికీ, ప్రస్తుతం వాతావరణంలో మార్పులు సంభవించి అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం వేళలో వర్షం కురుస్తూ, మధ్యాహ్న సమయంలో భానుడి ఉగ్రరూపంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో చెరువుల్లోని రొయ్యలు డీవోలతో ఉక్కిరిబిక్కిరై వైరస్‌లతో చిన్న సైజులోనే మృత్యువాత పడుతున్నాయి. కొంత మంది రైతులు లాభాల దిశగా చేప, రొయ్య మిశ్రమ సాగు (పాలీకల్చర్) చేస్తున్నా.. రొయ్య సాగు రోజులు గడవకముందే కొత్త కొత్త తెగుళ్లతో చిన్న కౌంట్‌తోనే చనిపోవడంతో రొయ్యను పట్టకుండానే వదిలివేసి నష్టాలను చూస్తున్నారు.

వాతావరణంలో విభిన్న మార్పులతో ఒక పక్క ఎండ, మరో పక్క వర్షాలు కురుస్తూ చెరువులో నీటి, మట్టి నాణ్యత లోపించడం, ఆక్సిజన్ స్థాయి తగ్గడం, డెడ్ ఆల్గే, విషవాయువులు విజృంభించడంతో వెనామీ రొయ్యల సాగులో వైట్ గట్, సెల్ లూజ్, రెడ్ గిల్, బ్లాక్ గిల్, హిబ్రియో వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, అమలాపురం మండలాల్లో అధికారంగా, అనధికారకంగా సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. మిశ్రమ పద్ధతిలో రొయ్యలు, చేపల సాగులో రొయ్యసాగు కలిసి వస్తే దానిపై వచ్చే ఆదాయం పెట్టుబడులుగా వచ్చి, చేపల సాగుపై వచ్చే ఆదాయం రైతుకు లాభదాయకంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితిల్లో హేచరీల నిర్వాహకులు నాసిరకమైన తల్లి రొయ్యలను వాడటంతో రొయ్య సీడ్ నుంచి ఈహెచ్‌పీ అనే వ్యాధి రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో రొయ్య మేత ఎక్కువగా తీసుకొని ఎదుగుదల లోపించడంతో రైతులు నష్టపోతున్నారు. వాతావరణం మార్పులుగా ఉండి నిలకడగా లేకపోవడంతో ఏరియేటర్లు ఎక్కువ సమయం తిప్పుతూ ఆక్సిజన్‌ను అందించాల్సి వస్తుందని, దీంతో అధికంగా ఖర్చు అవుతుందని, రొయ్యలు సమయానికి మేతలు తీసుకోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సమయానుకూలంగా సాగును పరిశీలించుకొని శానిటైజర్స్, మందులు వాడుతూ అధికంగా ఏరియేటర్లను తిప్పుతూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

హేచరీల వైఫల్యంతోనే నష్టపోతున్నాం



హేచరీల నిర్వాహకులు పూర్వం మంచి నాణ్యత కలిగిన తల్లి రొయ్యలను తెచ్చి దానితో నాణ్యమైన పిల్లలను అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నాసిరకమైన తల్లి రొయ్యలను వాడి నాసిరకమైన రొయ్య పిల్లలు ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో ఎంతో ఆశలతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి బ్యాచ్‌లో దిగే రొయ్యకు కచ్చితంగా వైట్ గట్ సోకి సమయానికి మేతలు తీసుకోక ఇబ్బంది పడే పరిస్థితి కనిపిస్తుంది. ప్రస్తుతం పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయి. అధికారులు దృష్టి సారించి హేచరీలపై చర్యలు తీసుకోకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది.

– పినిపే జయరాజు, ఆక్వా రైతు, చల్లపల్లి.

లాభాలు అందడం లేదు



వాతావరణంలో మార్పులకు చెరువులో రొయ్య పిల్లలు డీవోకు గురవుతున్నాయి. దీంతో ఏరియేటర్లు ఎక్కువ సమయం తిపాల్సి వస్తుంది. ఈ పరిస్థితిల్లో రొయ్యలు సకాలంలో మేతలు తినకపోగా ఏరియేటర్లు తిప్పడానికి ఖర్చు ఎక్కువ అవుతుంది. ఇంత కష్టపడినా సాగు లాభదాయకంగా చేతికొస్తుందనే భరోసా లేదు.

– నల్లా దుర్గ, ఆక్వా రైతు, వానపల్లిపాలెం.

సాగుచేసి నిరాశ పాలవుతున్నాం



వాతావరణ మార్పులకు రొయ్య సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నేను 6 ఎకరాల్లో చేప, రొయ్య మిశ్రమ సాగు చేస్తున్నాను. రొయ్యకు ప్రతి సారి ఈహెచ్‌పీ వ్యాధి సోకుతుంది. దీంతో పాటు వాతావరణ మార్పులతో వైరస్‌లు సంభవించడంతో పంట చేతికి రావడంలేదు. చేపకు వచ్చే లాభం రొయ్య తీసుకొని వెళ్లడంతో సాగు చేసే ప్రతి సారి ఎన్నో ఆశలతో సాగు చేసి నిరాశ పాలవుతున్నాం.

– సుందరనీడి సురేష్, ఆక్వా రైతు, ఉప్పలగుప్తం.

కలెక్టరేట్ వద్ద నిరసన


ఆక్రమణలు తొలగించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నర్సిపూడి గ్రామస్తులు


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రామమరాజులంక గ్రామస్తులు

అమలాపురం రూరల్: ఆలమూరు మండలం నర్సిపూడి పంచాయతీలో మంచినీటి నల్ల చెరువు, కొత్త చెరువును కొంతమంది అన్యక్రాంతం చేశారని, ఆక్రమణలు గుర్తించి చెరువులకు వేలం పాటను నిర్వహించాలని గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. పంచాయతీ నీటి చెరువులను సంరక్షించాలని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని, చెరువులు పంచాయతీ ఆధీనంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే నంబర్ 189/1, 161లో సమారు 8.30 ఎకరాలు చెరువుల చుట్టు అక్రమ నిర్మాణాలు, కట్టడాలు కట్టి అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారని ధర్నా చేశారు. ప్రభుత్వ కార్యాలయ కట్టడాలను అడ్డుకొని గ్రామ అభివృద్ధి చేయనివ్వకుండా ఆక్రమణదారులు అధికారులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ జీవో 188 ప్రకారం ఆక్రమణలను తొలగించాలని సొసైటీ అధ్యక్షుడు రాయుడు వెంకట స్వామి అధ్వర్యంలో గ్రామ పెద్దలు జేసికి ఫిర్యాదు చేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

అమలాపురం రూరల్: మలికిపురం మండలం రామమరాజులంక పంచాయతీలో సర్పంచ్ కాకర శ్రీను, సెక్రెటరీ ఏసుబాబు కలిసి ఉప సర్పంచ్ మెడిచర్ల గంగరాజు నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద గ్రామస్తులు నిరసన చేశారు. గతంలో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. పంచాయతీలో జరుగుతున్న కొన్ని అక్రమాలపై మేడిచర్ల మోహన్ రావు, రేకపల్లి రాంబాబు, మెడిచర్ల మోహన్, ముత్యాల ఆదినారాయణ తదితరులు జేసీ నిషాంతికి ఫిర్యాదు చేశారు. జూన్ 2025 నుంచి 31 ఆగస్టు 2025 వరకు గ్రామంలో బ్లీచింగ్ ఎక్కడ చల్లలేదని, స్టాక్ రూమ్‌లో లేని బస్తాలు కొనడం, దానికి నిధులను వెచ్చించడంపై విచారణ చేయాలని కోరారు. 38 గేట్ వాల్స్ వేసినట్లు బిల్లులు చేశారని కేవలం రెండు గేట్ వాల్స్ మాత్రమే బిగించి పంచాయతీ నిధులు స్వాహా చేశారని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర శానిటైజేషన్ బోర్డులో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. దీనిపై డీపీవోను విచారణ చేయాలని జేసి ఆదేశించినట్లు గ్రామస్తులు తెలిపారు.

యూరియా సరఫరా చేయాలని ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ కిసాన్ మోర్చా నాయకులు

అమలాపురం రూరల్: ప్రభుత్వం రైతులందరికీ సరిపడినంత యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీకి నిషాంతికి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేతకానితనం వల్ల యూరియా కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఆధార్ లింకుతో రైతుకు ఒక బస్తా మాత్రమే సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తుందన్నారు. ప్రైవేటు షాపుల్లో అధిక రేట్లకు అమ్ముతూ రైతులను దోచుకుంటున్నారన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అల్లూరి మధురాజు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కన్వీనర్ దేసినీడి ఉదయ భాస్కరరావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ మీసాల బాబీ, ఏపీసీసీ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు, తదిరతులు పాల్గొన్నారు.

పోస్టుల కేటాయింపులో అన్యాయం


ధర్నా చేస్తున్న నిరుద్యోగ యువకులు

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖలో 177 కనస్ట్రక్షన్ హెల్పర్ పోస్టుల్లో యానాం రీజియన్‌కు కేవలం 3 పోస్టులు కేటాయించినందుకు నిరసనగా సోమవారం బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఏఓ ఆఫీసు ఎదుట నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. అధ్యక్షుడు అర్థాని దినేష్ మాట్లాడుతూ, పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్ కనస్ట్రక్షన్ హెల్పర్ పోస్టులకు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసేవారని, అలానే రాష్ట్రం మొత్తం యూనిట్‌గా ఖాళీలు కేటాయించేవారన్నారు. అయితే మళ్లీ దానిని మార్చివేసి రీజియన్ వైజ్‌గా పోస్టులు కేటాయిస్తూ కొత్త నోటిఫికేషన్ జారీచేయడం అన్యాయమన్నారు. దీంతో వందలాది మంది యానాం రీజియన్ నిరుద్యోగ యువకులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి పోస్టులను రీజియన్‌వారీ కాకుండా రాష్ట్రస్థాయిలో నింపేవిధంగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, మెల్లం శ్రీను, చెక్కల అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డుల్లో జిల్లా పేరు మార్చాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంబాజీపేట మాల మహానాడు నాయకులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో స్మార్ట్ కార్డుల పంపిణీలో జిల్లా పేరును వక్రీకరించారని జిల్లా పోరాట వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లి శ్రీనివాస్, సెక్రెటరీ నూటుకుర్తి సత్యనారాయణ, బొంతు చందు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జేసీ నిషాంతికి వినతిపత్రం అందించారు. జిల్లా ఏర్పాటు చేసిన అప్పటి నుంచి ప్రభుత్వం ఆధార్ కార్డులలో జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా మార్పు చేయలేదన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై తూర్పుగోదావరి జిల్లా అని రావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోనసీమ జిల్లా అని మార్పు చేసే వరకూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిలుపుదల చేయాలని జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, గెద్దాడ బుద్ధ రాజు అమలాపురం తహసీల్దార్ అశోక్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

స్మార్ట్ కార్డుల్లోని తప్పులను సవరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

ఐ.పోలవరం: ఇటీవల ప్రభుత్వం జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులో డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకి బదులుగా, తూర్పు గోదావరి జిల్లా అని రావడాన్ని నిరసిస్తూ ఐ.పోలవరం మాల మహానాడు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండల మాల మహానాడు అధ్యక్షుడు రేవు శ్రీను అధ్యక్షతన తహసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పిలబడుతుండగా, మళ్లీ తూర్పుగోదావరి జిల్లా అని పేరు జిల్లాకు పెట్టి రేషన్ కార్డులు విడుదల చేయడం స్వార్థపూరిత రాజకీయ కుట్రన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరును యధాతథంగా రేషన్ కార్డులో ప్రచురించాలని లేకపోతే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒడ్డి గౌతం, మొలపర్తి శ్రీను, కాశి దుర్గ భవాని, ఒంటరి లావరాజు గుంటూరు శివరాజు, సాధనాల శివ, మాదేటి శ్రీను. రాజు, పి.బద్రి, పి.వికాస్ ఎం.నాని బాబు, ఎం.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

తాళ్లరేవు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించడం ఒక్కటే మార్గమని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు బ్రహ్మావేద తెలిపారు. సోమవారం తాళ్లరేవు గొల్లల వంతెన వద్ద శ్రీనివాస రెడ్డి పొలంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్యులు దవులూరి సుధ, ఏ.శుభశ్రీలు 63 పశువులకు గర్భకోశ, చూడు పరీక్షలు నిర్వహించి టీకాలు వేశారు.

స్వయం ఉపాధికి నైపుణ్య కోర్సులు తప్పనిసరి

యానం: మహిళల స్వయం ఉపాధి అవకాశాలను కల్పించుకోవడానికి వివిధ కోర్సుల్లో మెరుగైన నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ పెండెం సూర్యప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం భీమ్‌నగర్ కోనాగార్డెన్స్‌లో గ్లోబల్ కొలాబరేషన్ ఇనిషియేటివ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా బ్యూటీపార్లర్ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లను అందించేందుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు ఆధునిక సమాజంలో మహిళలు ఆర్థిక సాధికారిత సాధించి తద్వారా తమ కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఉపాధి కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం 20 మందికి బ్యూటిఫికేషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని జేసీ నిశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం, డీఎస్ఓ, వ్యవసాయ, రెవెన్యూ, సహకార, మార్కెటింగ్, తూనికలు కొలతల అధికారులతో ఖరీఫ్ ధాన్యం సేకరణ సన్నద్ధతపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 1,56,505 ఎకరాలలో వరి సాగు జరిగిందని సుమారుగా 4,34,000 మెట్రిక్ టన్నులు దిగుబడి రానుందని, వీటిలో వినియోగానికి 43,390 మెట్రిక్ టన్నుల పోగా మిగిలిన 3,88,000 మెట్రిక్ టన్నులు ప్రభుత్వ పరంగా కొనుగోలు చేయాల్సిందన్నారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు గతేడాది ఖరీఫ్ సీజను సేకరణలో మాదిరిగా, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోపే చెల్లింపులు జరుగుతాయన్నారు. నవంబరు మొదటి వారంలో మండపేట, ఆలమూరు, మండలాల్లో ధాన్యం సేకరణ ప్రారంభం జరుగుతుందన్నారు. జిల్లాలో 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలున్నాయని, వీటికి అనుబంధంగా 141 రైస్ మిల్లులు మ్యాపింగ్ చేశామన్నారు. గోనె సంచులు, లేబర్ రవాణా వాహనాల పరంగా ఇబ్బందులు పునరావృతం కాకుండా ముందస్తు కార్యాచరణతో సంసిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మాధవి, ఆర్డీవోలు పీ.శ్రీఖర్, డి.అఖిల, శ్రీనివాసరావు, డీఎస్ఓ ఉదయభాస్కర్ డీసీఎంఎస్‌పీ శ్రీనివాస్, డీసీఓ రాధాకృష్ణ, డీఏఓ బోసుబాబు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన వ్యాపారులు


ఎస్పీ రాహుల్ మీనాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వ్యాపారులు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాను స్థానిక ఎస్పీ కార్యాలయంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాలకు చెందిన ప్రతినిధులు సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు ఎస్పీని కలిసి కొద్దిసేపు మాట్లాడారు. అమలాపురం పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యాపారులు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, చాంబర్ ప్రతినిధులు నాగేశ్వరరావు, సంగినీడి బాబులు తదితరులు ఎస్పీని కలిశారు. అనంతరం ఎస్పీని వ్యాపార సంఘాల ప్రతినిధులు సత్కరించి అభినందించారు.

శ్రీనివాసరాజుకు నాయకుల సత్కారం


శ్రీనివాసరాజును సత్కరిస్తున్న మండల నాయకులు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంటరీ విభాగం)గా నియమితులైన చింతలపాటి శ్రీనివాసరాజును సోమవారం పలువురు పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఘనంగా సత్కరించారు. పిల్లంకలోని శ్రీనివాసరాజు స్వగృహం వద్ద జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు ఆయనను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ అమ్మవారి పానుపు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ దేవత శ్రీ మరిడమ్మ అమ్మవారి పానుపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారి తీర్థం మరుసటిరోజు తాళ్లరేవు పరదేశమ్మ వీధిలోని నాయుడు నారాయణమూర్తి, వీరరాఘవ రావు ఇంటివద్ద అమ్మవారిని నాయుడువారింటి కోడలుగా భావించి పానుపు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

యానాం: నియోజకవర్గ పరిధిలో పలువురు గంజాయి బ్యాచ్ రాత్రి వేళల్లో శాంతిభద్రతల పరిరక్షణకై గస్తీ తిరుగుతున్న పోలీసులపై దాడులు చేస్తుడటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి దరియాలతిప్ప అవుట్‌పోస్టు సమీపంలో పోలీస్ కానిస్టేబుల్, హోంగార్డు కలిసి బైక్‌పై గస్తీ తిరుగుతుండగా గంజాయి సేవించిన నలుగురు వ్యక్తులు, పోలీస్ కానిస్టేబుల్‌ని రక్తం వచ్చేలా ముఖంపైన, శరీరంపైన దాడి చేసి తీవ్రంగా గాయపర్చారన్నారు. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లగ ఎంఎల్‌సీ కేసు నమోదు చేశారని వారు తెలిపారు. భద్రతను పరిరక్షించే పోలీసులకే రక్షణ లేకుండా పోతుందని ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణం విచారణ నిర్వహించాలని గంజాయి బ్యాచ్ అగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సర్పంచ్ ఇసుకపట్ల జయమణి ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దివాకర్, ఆర్ఐ నాగూర్, సొసైటీ అధ్యక్షుడు చిక్కం ఉమామహేశ్వరరావు, ఉప సర్పంచ్ చీకురుమెల్లి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.